సాక్షి నంద్యాల

బుధవారం ; 14 ; జూన్ ; 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్నకు, బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



ప్రాణదాతలు

రక్త దాతల్లో చైతన్యం వచ్చి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. సామాజిక మాధ్యమాల పుణ్యమాని రక్తదాతల సంఖ్య పెరుగుతోంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కథనం.

8లో▸



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

19 నుంచి డిగ్రీ ప్రవేశాలకు అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): అండర్ గ్రాడ్యుయేషన్ యూజీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మంగళవారం తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, జూలై 3న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 4వ తేదీ నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని, ఆ రోజు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితర కోటా కింద స్పెషల్ కేటగిరి సీట్ల భర్తీ కోసం విజయవాడలోని ఎస్ఆర్ఆర్, విశాఖ లోని వీఎస్ కృష్ణ కాలేజీ, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఈనెల 21 నుంచి 23 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని ప్రిన్సి పాల్ తెలిపారు. వివరాలకు 9490602116, 9642434084ను సంప్రదించాలని సూచించారు.

అన్నప్రసాద వితరణకు రూ.3 లక్షల విరాళం



విరాళం అందించిన పశ్చిమగోదావరి జిల్లా అనంతలక్ష్మిని సత్కరిస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పలువురు భక్తులు రూ.2లక్షల విరాళాలను అందించారు. మంగళవారం ఆలయ డోనేషన్ కౌంటర్ వద్ద హైదరాబాద్‌కు చెందిన వి.సోమరాజు దంపతులు రూ.1,00,116, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన జి.అనంతలక్ష్మీ దంపతులు రూ.1,00,008, కృష్ణా జిల్లాకు చెందిన నవరత్నమ్మ దంపతులు రూ. లక్ష విరాళాన్ని ఆలయ ఏఈవో ఫణిధర ప్రసాద్‌కు అందజేశారు. విరాళాలను అందజేసిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

ముఖ గుర్తింపు పింఛన్లకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- చేసుకోకపోతే జూలై నెల పింఛను నిలుపుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్‌బీఐఎస్ ద్వారా ముఖ గుర్తింపుతో వైఎస్ఆర్ పెన్షన్ కానుక పొందుతున్న లబ్ధిదారులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్‌కు అర్హులు. ఇతర కేటగిరీలకు చెందిన పింఛనుదారులు విధిగా మూడు సార్లు వేలిముద్రలు, ఐరిష్ నమోదుకు ప్రయత్నించాలి. అప్పటికీ ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కర్నూలు జిల్లాలో ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా వైఎస్ఆర్ పెన్షన్ కానుక పొందుతున్న వారు 2419 మంది, నంద్యాల జిల్లాలో 1695 మంది ఉన్నారు. వీరంతా విధిగా అందుబాటులోని ఆధార్ సెంటర్‌కు వెళ్లి నాలుగైదు రోజుల్లో వేలిముద్రలు, ఐరిస్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో జూలై నెల పింఛను నిలిచిపోతుందని.. ఆధార్ అప్‌డేట్ చేసుకున్న తర్వాతే పింఛను పునరుద్ధరణ జరుగుతుందని ప్రాజెక్టు డైరెక్టర్ వెల్లడించారు.



డిజిటల్ రూపం.. కథా వైభవం!

ఉమ్మడి కుటుంబాలు తగ్గి నీతికథలపై ప్రభావం

- టీవీ, సెల్‌ఫోన్, కార్పొరేట్ చదువులతో కనుమరుగు
- ఇటీవల కాలంలో నీతికథలకు డిజిటల్ రూపం
- యానిమేషన్ వీడియోలతో సరికొత్త సొబగు
- యూట్యూబ్‌లతో పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి..
- నీతి కథలను టీవీల్లో పిల్లలకు చూపుతున్న తల్లిదండ్రులు

'చిట్టి చిలకమ్మా! అమ్మ కొట్టిందా?' పాటే వినపడలేదు. 'కొంగ- చేప', పులి-బంగారు కంకణం.. కోడి, పావురం స్నేహం, కాకి-కుందేలు' లాంటి పంచతంత్రం కథలు వినిపించడం లేదు. 'అమ్మమాట', 'ఎద్దు న్యాయం', రామయ్య-రాబంధు, కాకి-కుందేలు లాంటి నీతి కథలదీ అదే పరిస్థితి! 'ఎప్పటిలాగా శవాన్ని భుజాన వేసుకుని విక్రమార్కుడు ముందుకు కదిలాడు' అనే భేతాళ కథలు, చందమామ, బాలమిత్ర, పేదరాసి పెద్దమ్మ కథలు.. ఇలా ఎన్నో తరాలకు మంచి-చెడు, తెలివి తేటలు, నైతిక విలువలు, సృజనాత్మకత ఒక్క మాటలో చెప్పాలంటే జీవిత పాఠాలు నేర్పిన కథలు పాతికేళ్లుగా కనిపించ లేదు. చదివే వారు లేక కథల పుస్తకాల ప్రచురణ ఆగింది. టీవీలు, సెల్‌ఫోన్‌లు కథను చీకట్లోకి నెడితే, కార్పొరేట్ స్కూలు కనుమరుగు చేసింది. కథలతో పాటు కొత్త తరం కూడా మంచి, చెడుకు తేడా లేకుండా.. నమ్మకం, నిజాయితీకి అర్థం తెలీయకుండా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సమాజంపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ట్రెండ్ మారింది. కథకు మళ్లీ వైభవం వచ్చింది. గతంలో అక్షరంగా, మాటగానే ఉన్న కథ యానిమేషన్ వీడియోలతో 'స్మార్ట్' టీవీల్లో వెలిగిపోతోంది. 'మోటు పంతులు' టామ్ అండ్ జెర్రీ కాదు.. ప్రతి ఇంట్లో ఇప్పుడు సరికొత్త ట్రెండ్ పాతకాలం నాటి నీతి కథలే!!

సాక్షి ప్రతినిధి, కర్నూలు: హద్దులు లేని ప్రపంచం అంటే మన ఊహా ప్రపంచమే. అవధులు లేని కల్పనతో అద్భుత లోకాలను చుట్టి రాగలం. అలా ఒక ఆలోచన, కాల్పనికతతో రాసినవే కథలు. 'కార్పొరేట్' వ్యవస్థ లేని రోజుల్లో సర్కారు బడుల్లో పాఠం పూర్తి కావాలంటే కనీసం నాలుగు కథలు అయ్యవార్లు చెప్పేవారు. టీవీలేని రోజుల్లో, ఉమ్మడి కుటుంబాల కాలంలో ఇంట్లో అందరూ కలిస్తే బామ్మ, తాతయ్యలు చెప్పే కథలే ఎంటర్‌టైన్‌మెంట్. రాత్రిళ్లు ఆరుబయట పదిమంది కూర్చుంటే కథే కాలక్షేపం. చందమామ, బాలమిత్ర, పంచతంత్రంతో పాటు పలు నీతి కథలు విద్యార్థుల్లో మేధోవికాసాన్ని, నైతిక విలువలు పెంచేవి. ఆలోచన తీరు, వ్యక్తిత్వ వికాసం, సమాజాన్ని, పెద్దలను చూసే విధానం అత్యున్నతంగా ఉండేవి. రాజుల కథలు చెబితే వాటిని ఊహించుకుని సృజనాత్మకతను పెంచుకునేవారు. టీవీల రాకతో సీరియల్స్ మాయలో, భూతులే జోకులు అనుకునే కొన్ని కామెడీ షోలతో కథ క్రమంగా దూరమైంది. వీటితో పాటు మంచి జీవన విధానం కూడా కనుమరుగవుతోంది.

కార్పొరేట్ చదువులతోనే..

చదువును 'కార్పొరేట్' వ్యవస్థ శాసించేస్థితి వచ్చాక విద్యా విధానమే మారిపోయింది. పుస్తకాలను బట్టీ కొట్టి మక్కీకి మక్కీ పరీక్షలు రాసి ర్యాంకులు తెచ్చుకోవడమే చదువు అనేలా విద్యార్థులను మార్చేసింది. విద్యార్థుల్లో మేధోవికాసం తగ్గడానికి ఇదే ప్రధాన కారణం. ఇంటికి వచ్చిన వ్యక్తులతో ఎలా మాట్లాడాలో తెలీదు, ఇంట్లోని పెద్దలను గౌరవించడం తెలీదు.. గడప దాటి వెళితే ఇతరులతో ప్రవర్తించడమూ తెలీదు. చివరకు స్టేట్ ర్యాంకులతో టెన్త్ పాసైన పిల్లలు మరొక ఊరికి ఒంటరిగా వెళ్లాలన్నా, ఆఖరుకు కర్నూలు ఓల్డ్‌సిటీలో వదిలేస్తే ఇంటికి వెళ్లలేని పరిస్థితి. ఈతీరుతో పెరిగే పిల్లలకు ఈ వైఖరి వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు సమస్య వస్తే ఎలా అధిగమించాలి? కష్టం వస్తే ఎలా ధైర్యంగా ఉండాలి? ఎలాంటి వారితో సమస్యను పంచుకోవాలి? ఎక్కడ జాగ్రత్తగా ఉండాలి? అనే అవగాహన, మానసిక స్థైర్యం కూడా ఉండటం లేదు. తల్లిదండ్రులు కూడా 'మా అబ్బాయి, అమ్మాయికి ర్యాంకులు వచ్చాయి' అని సంబరపడటం మినహా చదువుతో పాటు వారికి జీవితాన్ని, జీవిత పాఠాలను నేర్పిస్తున్నామా? లేదా అనేది మర్చిపోవడం గమనార్హం.



కథకు మళ్లీ జీవం వచ్చింది. ఇంతకు మునుపు పుస్తకాల్లో చదివే వాళ్లం. ఎవరైనా చెబితే వినేవాళ్లం. పాత్రలను ఊహించుకునేవాళ్లం. టెక్నాలజీ ముసుగులో దెబ్బతిన్న కథ, తిరిగి అదే

సరికొత్తగా డిజిటల్ రూపంలో..

టెక్నాలజీతోనే సరికొత్తగా దర్శనమిస్తోంది. కథలోని పాత్రలతో యానిమేషన్ వీడియోలతో డిజిటల్ రూపంలో వెలిగిపోతున్నాయి. యూట్యూబ్‌లోకి వెళితే పాతకాలం నాటి పద్యాలు, పాఠాలు, చందమామ, పంచతంత్రం, భేతాళ కథలతో పాటు వేల రకాలు కథలు అందుబాటులో ఉన్నాయి. పాతవే కాకుండా కొత్తగా పలు కంపెనీలు నేటి ట్రెండ్‌కు తగినట్లు కొత్త కథలను డిజైన్ చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల వైఖరిని గమనించి, చదువు మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసం ముఖ్యమని మార్పు దిశగా ఆలోచిస్తున్నారు. దీంతో చిన్నపిల్లలకు టీవీల్లో చిట్టిచిలకమ్మ లాంటి పాటల నుంచి నీతి కథల వరకూ చూపుతున్నారు. పిల్లలు కూడా వీటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. పంచతంత్రం కథల్లో పక్షులు, జంతువులు ఉండటం, యానిమేషన్స్‌తో ఆసక్తి ఉండేలా వీడియోలు ఉంటంతో పిల్లలు శ్రద్ధగా చూస్తున్నారు. ప్రతీ ఇంట్లో ఇప్పుడు స్మార్ట్ టీవీలు ఉన్నాయి. ఫైబర్ కేబుల్ వచ్చిన తర్వాత ఇంటర్నెట్ అందుబాటులో ఉంది. దీంతో ప్రతీ ఇంట్లో 'స్మార్ట్ కథలు' వినిపిస్తున్నాయి.

● పిల్లలతో పాటు పెద్దల్లో కూడా ఆసక్తి

కథలు డిజిటల్‌లోకి వచ్చాక పిల్లలతో పాటు పెద్దల్లో కూడా ఆసక్తి పెరిగింది. నీతి కథలతో పాటు ప్రేమ కథలు, థ్రిల్లర్, హర్రర్‌తో పాటు పలు రకాల కథలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇంట్లో పిల్లలతో పాటు, ప్రయాణాల్లో, ఉద్యోగంలో ఉన్నప్పుడు తీరిక సమయంలో సెల్‌ఫోన్‌లలో కూడా ఈ కథలను చూస్తున్నారు. సినిమాల కంటే కథలపై ఆసక్తి చూపుతున్నారు. 2.30 గంటల సినిమా నుంచి 40 నిమిషాల వెబ్‌సిరీస్‌కు ఎలా అలవాటయ్యారో, ఇప్పుడు 5-10 నిమిషాల కథపైనే ఆసక్తి చూపిస్తున్నారు. పైగా కథ ఆసక్తిగా, ఏదో ఒక మంచి విషయాన్ని తెలుసుకునేలా ఉండటంతో ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తున్నారు. చదవడంతో పోలిస్తే చూడటం ద్వారా వచ్చే విషయ పరిజ్ఞానం తక్కువే. చదివితే మెదడులో శాశ్వతంగా గుర్తుండిపోతుంది. దృశ్యరూపం అనేది ఎక్కువ కాలం గుర్తు ఉండదు. అయితే పూర్తిగా దూరమైన కథ ఈ రకంగా దగ్గర కావడం అనేది శుభపరిణామం.







పిల్లలకు కథలను పంపిస్తున్నాం

టెక్నాలజీని విద్యార్థులు అందుకుంటున్నారు. సెల్ చేతిలోకి వచ్చాక యూట్యూబ్ వాడకం ఎక్కువైంది. కామిక్స్, కథలు వస్తున్నాయి. చిత్రాలు గీయడం ఎలా అనేవి తెలుసుకుంటున్నారు. టామ్ అండ్ జెర్రీ లాంటి కథలు ఒకరిని ఒకరు మోసం చేసుకునేలా ఉంటాయి. కానీ తెలుగు కథల్లో నీతి ఉంటుది. నేనైతే వాట్సాప్‌లో కథలు పంపిస్తున్నా. 43 రోజుల వేసవి సెలవుల్లో పొడుపు కథలతో పాటు నీతి కథలను రెండు రాష్ట్రాల్లోని 4వేల మంది పిల్లలకు వాట్సాప్ గ్రూపులో పంపిస్తున్నాం. టీచర్ల గ్రూపులకు చేరవేస్తున్నాం. వారు పిల్లలకు బోధిస్తున్నారు.

– పుల్లా రామాంజనేయులు, తెలుగు ఉపాధ్యాయుడు



మేం ఉన్నట్లు.. మా పిల్లలే ఉండటం లేదు

కథని ఇష్టపడని వారు ఎవ్వరూ ఉండరు. పుస్తకాల్లో చదవడం, వినడం ద్వారా నైతిక విలువలు నేర్చుకునేవారు. ఇప్పుడు కథ లేదు. పిల్లల తీరులోనూ మార్పు వచ్చింది. మేం ఉన్నట్లు మా పిల్లలే ఉండటం లేదు. పాత జనరేషన్‌లోని నైతిక విలువలు ఇప్పుడు లేవు. కథలు హృదయానికి హత్తుకునేవి. రాజులు కథలు ఊహాలోకంలోకి తీసుకెళ్లేవి. అద్భుత ప్రపంచాన్ని కళ్లముందు ఆవిష్కృతమయ్యేలా చేసేవి. ఇప్పుడు కథలు లేకపోవడంతో సృజనాత్మకతతో పాటు అన్నీ లోపిస్తున్నాయి. పాత కాలమే బాగుంది. డిజిటల్‌లోకి కథలు రావడం మంచిదే. అయితే చదివితేనే బాగుంటుంది.

– పసుపులేటి నీలిమ, ఉపాధ్యాయురాలు

నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు



నేషనల్‌హైవే పీడీ తరుణ్‌కుమార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

పాములపాడు: నేషనల్ హైవే నిర్మాణానికి చేపడుతున్న భూ సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తప్పవని నేషనల్ హైవే పీడీ తరుణ్‌కుమార్ హెచ్చరించారు. భూ సర్వేలో అధికారులు తప్పుడు కొలతలు వేశారని గ్రామస్తులు జేసీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం పీడీ పరిశీలన చేశారు. మండల కేంద్రంలోని సర్వే నెంబరు 62లో గతంలో 0.38 సెంట్లు నేషనల్ హైవేకు తీసుకునేందుకు నిర్ణయించినట్లు చూపారని, ప్రస్తుతం 1.11 సెంట్లు తీసుకుంటున్నట్లు ప్రస్తుతం రికార్డుల్లో పేర్కొన్నారని, అలాగే సర్వే నెంబరు 152, 178లో కూడా ఇలాగే జరిగిందని గ్రామస్తులు శ్రీనివాసరావు, హరి సర్వోత్తమరావులు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం స్పందించిన పీడీ మాట్లాడుతూ వారం రోజుల్లో మళ్లీ వస్తానని, పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.ఆయన వెంట తహసీల్దార్ రత్నరాధిక తదితరులు ఉన్నారు.

15 నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

డోన్ టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాల కోసం ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, డోన్ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేటాయించిన తేదీల వారీగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. అభ్యర్థుల ఫోన్లకు సమాచారం ఇచ్చామన్నారు.

నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
వై.విజయకుమార్	హాలహర్వి	జలదుర్గం
పి.తిమ్మయ్య	ఆళ్లగడ్డ టౌన్	నందవరం
డి.మహేష్‌కుమార్	నందవరం	వీఆర్
వై.పవన్‌కుమార్	వీఆర్	గూడూరు

కర్నూలు: జిల్లా పోలీసు శాఖలోని వివిధ స్టేషన్లలో పనిచేస్తున్న నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ ఇచ్చిన ప్రొసీడింగ్ మేరకు ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంతో పాటు లాంగ్ స్టాండింగ్ తదితర కారణాలతో ఒక చోటు నుంచి మరొక చోటికి వీరిని బదిలీ చేశారు. ఎస్‌ఐ డి.మహేష్‌కుమార్ దాదాపు నాలుగేళ్లుగా నందవరంలో పని చేస్తున్నారు. లాంగ్ స్టాండింగ్‌తో పాటు పలు ఆరోపణల నేపథ్యంలో ఆయనను వీఆర్‌కు పంపినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది.

ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



కియోస్క్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల(రూరల్): ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు తమ పరిధిలోని సాగయ్యే విస్తీర్ణానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పెద్ద కొట్టాల రైతు భరోసా కేంద్రంలోని కియోస్క్ యంత్రాన్ని, మాయిశ్చర్ మీటర్‌ను, ఎరువులు భద్రపరచిన గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వివిధ రికార్డులను తనిఖీ చేస్తూ అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాల స్టాక్‌ను పరిశీలించారు. ఇప్పుడిప్పుడే రైతులు పొలాల్లో సేద్యం పనులు మొదలు పెట్టారని సాగుకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఏఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి భార్గవి, వీఆర్ఓ హుసేన్‌బాషా, తదితరులు ఉన్నారు.

ప్రజల్లో అపోహలు తొలగించండి

- మల్లికార్జున రిజర్వాయర్‌పై అవగాహన కల్పించాలి
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పలుచగా జెడ్పీటీసీ, అధికారుల హాజరు
- జెడ్పీ ఛైర్మన్ స్థానంలో వైస్ ఛైర్ పర్సన్ దిల్షాద్ ముజఫర్ నాయక్ సమావేశాల నిర్వహణ





మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో వైస్ ఛైర్మన్ దిల్షాద్ ముజఫర్ నాయక్, సీఈఓ నాసరరెడ్డి, హాజరైన జెడ్పీటీసీలు, అధికారులు

కర్నూలు(అర్బన్): వ్యవసాయానికి సాగునీరు, పారిశ్రామికాభివృద్ధి అవసరాలకు రూ.2 వేల కోట్ల వ్యయంతో ఓర్వకల్లు-మిడుతూరు మధ్యలో నిర్మించనున్న మల్లికార్జున రిజర్వాయర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని మిడ్తూరు జెడ్పీటీసీ పి. యుగంధర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ దిల్షాద్ ముజఫర్ నాయక్ అధ్యక్షతన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఇరిగేషన్‌పై జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ... ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.1.55 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సర్వే జరగకుండా అడ్డుపడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని వారిలో అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌బీసీ ఈఈ శుభకుమార్ మాట్లాడుతూ 16 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం జరిగితే 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అయితే ... రిజర్వాయర్ నిర్మాణం కోసం దేవనూరు, చింతలపల్లి, సున్నంపల్లి, గుడిపాడు, ఖాజీపేట గ్రామాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించుకుంటే భూసేకరణ కూడా తగ్గుతుందన్నారు. అయితే ... 2014 ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం అద్భుతమైన ప్యాకేజీలను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రభుత్వ ప్యాకేజీలు, పరిహారం తదితర వివరాలను వివరిస్తామని, రిజర్వాయర్ నిర్మాణానికి అందరికీ ఆమోదయోగ్యమైన అంశం మేరకు ముందుకు వెళ్తామన్నారు.

కల్లూరు వక్కెర వాగుపై సేఫ్టీ వాల్స్ ఏర్పాటు చేయండి

కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వచ్చే దారిలో ఉన్న వక్కెర వాగుపై వెంటనే సేఫ్టీ వాల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ ఇంజినీర్లను ఎమ్మెల్యే కాటసాని కోరారు. ఈ వాగుపై ఉన్న లోలెవెల్ బ్రిడ్జి స్థానంలో హైలెవెల్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌కుమార్ చెప్పారు. లక్ష్మీపురం వద్ద కూడా బ్రిడ్జి పెండింగ్‌లో ఉందని, అధికారులు దృష్టి సారించాలని కాటసాని చెప్పారు.

పలుచగా జెడ్పీటీసీలు, అధికారులు హాజరు ...

ప్రతి 60 రోజులకు ఒకసారి నిర్వహించే జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలపై ఇటు జెడ్పీటీసీ, అటు అధికారుల్లోనూ శ్రద్ధ లేనట్లు కనిపిస్తోంది. మూడవ స్థాయీ సంఘ సమావేశాల్లో వ్యవసాయం, ఉద్యాన వన శాఖ, పట్టు పరిశ్రమ, ఏపీ ఆగ్రోస్, ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎంతో ముఖ్యమైన ఈ శాఖలపై చర్చించేందుకు ఎనిమిది మంది జెడ్పీటీసీల్లో వైస్ చైర్మన్‌తో పాటు ముగ్గురు జెడ్పీటీసీలు మాత్రమే హాజరయ్యారు. పలు కమిటీలకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు కూడా గైర్హాజరయ్యారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖపై జరిగిన సమీక్షల్లో చైర్ పర్సన్ పి. దివ్య, ఆదోని కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అస్లామ్ ఖాద్రీ మాత్రమే హాజరయ్యారు. కొన్ని శాఖలకు సంబంధించి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను పంపడంపై జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన నంద్యాల జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీకి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆయన ఆదేశించారు.

జెడ్పీ చైర్మన్ స్థానంలో వైస్ చైర్‌పర్సన్ సమావేశాల నిర్వహణ

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాంతో పాటు అధికారులు హొస్పేట్ టీబీ డ్యాంలో నీటి పారుదల శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ దిల్షాద్ ముజఫర్ నాయక్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

ఇంటర్ సప్లిమెంటరీలో పెరిగిన ఉత్తీర్ణత

- ఫస్టియర్‌లో 72.59 శాతం, సెకండియర్‌లో 76.42 శాతం ఉత్తీర్ణత
- సత్తా చాటిన కేజీబీవీ, మోడల్ స్కూల్ కాలేజీల విద్యార్థులు
- ఆస్పరి కేజీబీవీ వంద శాతం ఉత్తీర్ణత,
- ఈ నెల 26 లోపు రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు దరఖాస్తులు

కర్నూలు (సిటీ): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. మంగళవారం ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో ఉమ్మడి కర్నూలు జిల్లా మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 9వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 12వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం పరీక్షలకు 28,294 మంది విద్యార్థులు హాజరుకాగా, 20,538 మంది (72.59 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ విద్యార్థులు 26,126 మందికి గాను 19,966 మంది (76.42 శాతం) ఉత్తీర్ణులయ్యారు. మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షల కంటే సప్లిమెంటరీలో ఉత్తీర్ణతం శాతం పెరిగింది. మొదటి సంవత్సరంలో ఆరు శాతం, ద్వితీయ సంవత్సరంలో 10 శాతం పెరిగింది. ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో మొదటి సంవత్సరంలో 4 ప్రైవేటు కాలేజీలు, ద్వితీయ సంవత్సరంలో 6 ప్రైవేటు కాలేజీలు జీరో, మరో ఆరు కాలేజీలు సింగిల్ డిజిట్ ఉత్తీర్ణత సాధించాయి. ఆస్పరి కస్తూర్బా జూనియర్ కాలేజీలో ఫస్టియర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖాధికారులు తెలిపారు.

➡ ఉమ్మడి జిల్లాలో 35 ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. మొదటి సంవత్సర ఫలితాల్లో 1,470 మందికి గాను 514 మంది సప్లిమెంటరీ (34.97 శాతం), ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 1,399 మందికి గాను 537 మంది (38.38 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

➡ ఉమ్మడి జిల్లాలో 47 కేజీబీవీ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 589 మంది విద్యార్థులకు గాను 236 మంది (40.07 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో (కేవలం 17 కాలేజీల్లో మాత్రమే) 217 మందికి 102 మంది (47.00 శాతం) పాస్ అయ్యారు

➡ ఉమ్మడి జిల్లాలో 42 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలకు చెందిన విద్యార్థులు మొదటి సంవత్సరంలో 2,645 మందికి గాను 718 (27.15 శాతం), ద్వితీయ సంవత్సరంలో 3, 352 మందికి గాను 1,143 (34.10 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు.

➡ ప్రైవేటు జూనియర్ కాలేజీలు మొత్తం పబ్లిక్ పరీక్షల ఫలితాలతో పోలిస్తే సప్లిమెంటరీలో వెనుకబడ్డాయి. ఫస్ట్ ఇయర్ 107 కాలేజీలకు చెందిన 6,486 మందికిగాను, 2,119 మంది మాత్రమే(32.67 శాతం), సెకండ్ ఇయర్ 122 కాలేజీలకు చెందిన 6,774 మందికిగాను, 2083 మంది(30.75 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

క్లుప్తంగా

పురావస్తు శాస్త్ర కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర సంస్కృతి, పురావస్తు శాస్త్రపీఠం శ్రీశైలం ప్రాంగణంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఎంఏ, పీహెచ్‌డీ పురావస్తు శాస్త్ర కోర్సులో ప్రవేశం పొందే అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పీఠాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కోర్సులో చేరడానికి బీఏ, బీకాం, బీఎస్సీ, మరే దైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ విద్యాసంవత్సరం పీహెచ్‌డీలో 9 సీట్లు, ఎంఏలో 40 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.telugu university.ac.inలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9441370591, 9989240806ను సంప్రదించాలన్నారు.

స్నానానికి వెళ్లి.. శవమై తేలాడు

కర్నూలు: తుంగభద్ర నదిలో స్నేహితునితో కలసి స్నానానికి వెళ్లి ఓ యువకుడు మంగళవారం శవమై తేలాడు. సాయిబాబా సంజీవయ్య నగర్‌లో నివాసముంటున్న జయన్న, షేకున్ దంపతుల కుమారుడు రాజేష్ (16) పదవ తరగతి వరకు చదువుకున్నాడు. సోమవారం రోజు స్నేహితునితో కలసి సరదాగా తుంగభద్ర నదికి వెళ్లి నాగసాయి దేవాలయం వద్ద ఈత కొట్టేందుకు నదిలోకి దిగి మునిగిపోయాడు. స్నేహితులు అతనిని కాపాడేందుకు ప్రయత్నించినా కనిపించలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆ ప్రాంతంలో గాలించినా ఆచూకీ కనిపించలేదు. మంగళవారం ఉదయం విద్యార్థి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. రెండవ పట్టణ పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు.

పాముకాటుతో బాలుడి మృతి


ధర్మతేజ (ఫైల్)

ఆలూరు రూరల్: పాము కాటుకు గురై ఓ బాలుడు మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. ఆలూరు పట్టణంలోని కేడీసీసీ బ్యాంకు సమీపంలో నివాసం ఉంటున్న రామాంజినమ్మ, ఉరుకుందు దంపతుల కుమారుడు ధర్మతేజ (10) ఈనెల 9వ తేదీ శుక్రవారం రాత్రి 11 గంటలకు ఇంట్లో నిద్రిస్తుండగా పాము కరిచింది. గమనించిన తల్లిదండ్రులు ఆలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. గత నాలుగు రోజుల నుంచి అక్కడే చికిత్స పొందుతూ.. మంగళవారం మధ్యాహ్నం కోలుకోలేక మృతిచెందాడు. ధర్మతేజ (10) ఆలూరులోని ఎంపీపీ మెయిన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పాణ్యంలో హిజ్రాల ఘర్షణ

పాణ్యం: స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట మంగళవారం రెండు గ్రూప్‌ల హిజ్రాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇంటి విక్రయానికి సంబంధించి రెండు గ్రూప్‌ల వారు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్ ముందు వారి మధ్య మాటమాట పెరగడంతో ఒకరిపై ఒకరి దాడి చేసుకున్నారు. పోలీసులు రెండు గ్రూప్‌లను చెదరగొట్టారు. నంద్యాల, పాణ్యం పట్టణాలకు చెందిన హిజ్రాలు ఉన్నారని, ఒక హిజ్రాకు గాయాలు కాగా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

ప్రాణదాతలు!

- రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్న యువత
- జిల్లాలో యేటా 50 వేల యూనిట్ల రక్త సేకరణ
- అందుబాటులో 13 బ్లడ్‌బ్యాంకులు, ఆరు కోల్డ్ స్టోరేజ్ పాయింట్లు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): చాలా మంది రక్తం అందక విలువైన ప్రాణాలు కోల్పోతుంటారు. అలాంటి వారికి సకాలంలో మన ఒంట్లో జీవధారగా ప్రవహించే రక్తాన్ని అందిస్తే ప్రాణాలు నిలుస్తాయి. అందుకే ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాల్సిన అవసరం ఉంది. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఎనిమిది ప్రధాన ప్రజా ఆరోగ్య కార్యక్రమాల్లో రక్తదాతల దినోత్సవం ఒకటి. దానిని ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీన నిర్వహిస్తున్నారు. రక్తదానంపై అవగాహన పెంపొందించడం, సురక్షిత రక్తమార్పిడి వల్ల కలిగే లాభాలను తెలపడం, స్వచ్ఛంద రక్తదాతలను, ప్రాణదాతలను సత్కరించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. కర్నూలు నగరంలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న రక్తనిధి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి, ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి రక్తనిధి, విశ్వభారతి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ బ్లడ్‌బ్యాంకు, విశ్వభారతి హాస్పిటల్(పెంచికలపాడు) బ్లడ్‌బ్యాంక్, గాయత్రి ఎస్టేట్‌లోని విశ్వభారతి బ్లడ్‌బ్యాంక్, కర్నూలులోని అక్షయ బ్లడ్‌బ్యాంక్, ఆర్ హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్, న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, కేర్ బ్లడ్ సెంటర్, కర్నూలు బ్లడ్ సెంటర్, గోపిచారిటబుల్ బ్లడ్‌సెంటర్ (ఆదోని), ఏడీపీ వాలంటరీ బ్లడ్ సెంటర్(ఆదోని), మహాత్మా గాంధీ బ్లడ్ బ్యాంక్(ఆదోని) ఉన్నాయి. వీటితో పాటు ఆదోని ఎంసీహెచ్ హాస్పిటల్, పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తనిల్వ కేంద్రాలు ఉన్నాయి. కాగా జిల్లాలో యేటా 50 వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల ద్వారా రక్తదానం

పాతికేళ్ల క్రితం రక్త దాతలు లభించక రక్తం అందుబాటులోకి రాక ప్రాణం పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల పుణ్యమా రక్తదాతల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. దాతలు గ్రూపులుగా ఏర్పడి వాట్సాప్‌లో అనుసంధానమవుతున్నారు. ఎవ్వరికైనా రక్తం కావాల్సి వస్తే ఆయా గ్రూపులో సమాచారం ఇస్తే చాలు కొన్ని నిమిషాల్లోనే అవసరార్థుల వద్దకు చేరుకుంటున్నారు. అన్ని బ్లడ్‌బ్యాంకుల్లోనూ దాతల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుతున్నారు. కర్నూలుతో పాటు ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో యువకులు గ్రూపుగా ఏర్పడి రక్తదానం చేస్తున్నారు.

రక్తదానం చేయడానికి అర్హత...

- దాత బరువు 45 కిలోలు ఉండాలి.
- వయస్సు 18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.
- దాత నాడి నిమిషానికి 60 నుంచి 100సార్లు కొట్టుకోవాలి.
- రక్తంలో హెచ్‌బీ శాతం 12.5గ్రాములకు పైగా ఉండాలి.

ఇవ్వాల్సింది 300 మి.లీటర్ల రక్తమే !

ప్రతి మనిషిలో 5 లీటర్ల రక్తం ప్రవహిస్తుంది. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. రక్తదానం సమయంలో ప్రతి వ్యక్తి నుంచి కేవలం 300 మి.లీటర్ల రక్తం మాత్రమే తీసుకుంటారు. ఆ రక్తం మళ్లీ కొన్ని గంటల్లోనే శరీరంలో తయారవుతుంది. అన్ని పరీక్షలు చేసిన తర్వాతే రక్తం సేకరిస్తారు. సేకరించిన రక్తాన్ని అవసరం ఉన్న రోగులకు ఎక్కిస్తారు.

జిల్లాలో 8 ఏళ్లలో రక్తసేకరణ వివరాలు ఇలా..

సంవత్సరం	లక్ష్యం	సేకరించిన యూనిట్లు	లక్ష్యసాధన శాతం	స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు	సేకరించిన రక్తం యూనిట్లు
2014-15	41025	30738	74.93	103	7,816
2015-16	42068	37969	90.26	131	9,636
2016-17	42800	39567	92.45	132	8,935
2017-18	43500	40836	93.88	182	8,697
2018-19	44600	57506	128.94	303	13,458
2019-20	45900	57004	124.19	259	11,676
2020-21	46500	45829	98.56	169	8,968
2021-22	52550	59174	112.61	139	5,700
2022-23	45,912	51,076	111.25	108	7,939
2023-24	4,086	6570	160.79	22	486

రక్తదానంతో పాటు సేవా కార్యక్రమాలు



నాది ఎ పాజిటివ్ రక్తం. నేను 2015లో మొదటిసారిగా హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఓ మహిళకు ఆపరేషన్ అవసరమై రక్తం కావాలంటే రక్తదానం చేశాను. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాను. ప్రస్తుతం కారు డ్రైవర్‌గా ఉంటూ జీవనం సాగిస్తున్నాము. ఇప్పటి వరకు 22 సార్లు రక్తదానం చేశాను. యువభారత్ సంస్థలో కోశాధికారిగా ఉంటూ రక్తదానాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. –పి. శశిధర్‌రెడ్డి, కృష్ణానగర్, కర్నూలు

37 సార్లు రక్తదానం చేశాను



నా బ్లడ్‌గ్రూపు ఎ-పాజిటివ్. నేను మొదటిసారి 2014లో ఓ మధ్య వయస్సు వ్యక్తికి రక్తం అవసరమైతే ఇచ్చాను. అప్పుడు రాగిమాన్ రమేష్ అనే అన్న నాకు అవగాహన కల్పించి ధైర్యం చెప్పడంతో రక్తదానం చేశాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు 37 సార్లు రక్తదానం చేశాను. దీంతో పాటు కర్నూలు బ్లడ్ డోనార్స్ గ్రూపు ద్వారా అవసరార్థులకు రక్తదానం చేయిస్తుంటాను. ఓ ప్రైవేటు బ్లడ్‌బ్యాంకులో పనిచేసే నేను రక్తదానం చేయడానికి వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇస్తుంటాను. –బి. రామాంజనేయులు, పుచ్చకాయలమడ,పత్తికొండ

రక్తం కొరత లేకుండా చూస్తున్నాము



జిల్లాలో రక్తం కొరత లేకుండా ఉండేందుకు గాను డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌లను ఏర్పాటు చేశాము. దూరప్రాంతాల వారి కోసం సీహెచ్‌సీల్లో బ్లడ్‌స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేశాము. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వంద మంది రక్తదాతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో అన్ని బ్లడ్ బ్యాంకుల్లో సన్మానించనున్నాము. అన్ని బ్లడ్ బ్యాంకుల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాము. దీంతో పాటు యువతీయువకులతో రక్తదానంపై అవగాహన, ప్రతిజ్ఞ చేయిస్తున్నాము.
–డాక్టర్ ఎల్. భాస్కర్, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణాధికారి, కర్నూలు

రెడ్‌క్రాస్‌లో రాయితీపై రోగులకు రక్తం



ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకులతో సమానంగా ఏపీశాక్స్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులను గుర్తించింది. ఈ మేరకు రెడ్‌క్రాస్‌కు కిట్స్, బ్లడ్‌బ్యాగ్స్, రీ ఏజెంట్స్‌ను అందించేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చే రోగులకు మరింత రాయితీతో రక్తం ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. ఈ యేడాది పదివేల యూనిట్ల రక్తం సేకరించేందుకు ప్రణాళిక రూపొందించాము. తలసీమియా బాధిత చిన్నారులకు ప్రతి యేటా వెయ్యి యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందజేస్తున్నాము.
–డాక్టర్ కె.జి. గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, కర్నూలు

367 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు


జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పనిచేస్తున్న 367 మంది జర్నలిస్టులకు జీఓ 38 ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు స్వయంగా అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎళ్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు నిబంధనలు మేరకు పని చేస్తూ జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ జయమ్మ పాల్గొన్నారు.

అగ్రీ ల్యాబ్‌ల్లో ఉచిత పరీక్షలు

- వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్షలో కలెక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌ల్లో ఎరువులు, విత్తనాల నాణ్యత ప్రమాణాలను ఉచితంగా పరీక్షించుకోవచ్చని జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అగ్రీ ల్యాబ్‌ల్లో ఇప్పటి వరకు ఎంతమంది రైతులు విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలను పరీక్షించుకున్నారనే వివరాలు అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల నియంత్రణకు మరింత చొరవ తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తన దుకాణాలు, కంపెనీలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. మండలాల వారీగా సబ్సిడీపై పంపిణీ చేసిన విత్తనాల వివరాలను అందచేయాలని డీఏఓను ఆదేశించారు. చిరుధాన్యాలకు కూడా ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిందని, సాగుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ అర్హత కలిగిన సాగుదారులందరికి సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేయాలన్నారు. పీఎం కిసాన్ కింద లబ్ధి పొందుతున్న రైతులతో 100 శాతం ఈ-కేవైసీ చేయించాలని తెలిపారు. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, ఏడీఎం నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ - వ్యక్తి మృతి

డోన్ టౌన్: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై దొరపల్లె సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణగిరి మాజీ ఎంపీపీ కేశ మద్దిలేటి రెండో కుమారుడు కేశ భాస్కర్ గౌడ్ మృతి చెందాడు. బైకుపై డోన్ నుంచి కంబాలపాడు గ్రామానికి దొరపల్లె మీదుగా వెళ్తుండగా అనంతపురం పట్టణం రాణినగర్‌కు చెందిన తలారి లింగమూర్తి బైకుపై డోన్ వైపు వస్తుండగా ఎదురెదురుగా రెండు బైకులు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో భాస్కర్‌గౌడ్ తలకు తీవ్ర గాయాలు కాగా కర్నూలుకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. స్వల్పగాయాలైన లింగమూర్తిని డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు న్యాయం..నిందితులకు శిక్ష

- నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం



నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : కేసుల్లో బాధితులకు న్యాయం చేస్తూ, నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా చూడాలని ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో మంగళవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సబ్ డివిజన్ల వారీగా నమోదైన కేసులను సమీక్షించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి వాటి పరిష్కారానికి తగు సూచనలు చేశారు. దొంగతనాలు జరగకుండా రాత్రి గస్తీ పెంచాలని, పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుల పట్ల మర్యాదగా మసలుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదయ్యే కేసులను ఎఫ్ఐఆర్ దగ్గర నుంచి ఫైనల్ చార్జ్ షీటు వరకు సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు.

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై శ్రద్ధ వహించండి

జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు జరగకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు స్టేషన్ల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమైనందున స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ చేయించుకునే విధంగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడాలన్నారు.

పల్లె నిద్ర కార్యక్రమాలు విస్తృతం చేయండి

ఎన్నికలు రాబోతున్న తరుణంలో గ్రామాల సందర్శన, పల్లెనిద్ర కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎస్పీ అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, దిశ యాప్‌ను మహిళల చేత డౌన్‌లోడ్ చేయించే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఒక్కొక్క పోలీసు అధికారి పది పెండింగ్ కేసుల దర్యాప్తును చేపట్టి పూర్తి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి.సర్కార్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు విజయశేఖర్, శివనారాయణస్వామి, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, యుగంధర్ బాబు, నాగభూషణం, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- 61 మంది అధికారులకు ప్రశంసాపత్రాలు

గత రెండు నెలల కాలంలో జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచిన 61 మంది పోలీసు అధికారులు ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతో పాటు గుడ్ సర్వీస్ ఎంట్రీ (జీఎస్ఈ), నగదు రివార్డులను అందుకున్నారు. నేర సమీక్షా సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా బందోబస్తు, అంతకుముందు యువగళం బందోబస్తు, అక్రమ మద్యం రవాణా చేస్తున్న నిందితుల అరెస్టులు, మొబైల్ రికవరీ మేళా తదితర విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు గాను ఐదుగురు డీఎస్పీలు, 22 మంది సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 24 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు ఆర్థిక సహాయం అందజేస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గ దర్గాకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెలుగోడు, బండి ఆత్మకూరులోని బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే శిల్పా కలిసి వారికి మనో ధైర్యాన్ని ఇచ్చారు. గాయపడి కర్నూలు, నంద్యాల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా ఆసుపత్రుల వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకొని ఘటన స్థలానికి వెలుగోడు నుంచి పార్టీ నాయకులను పంపించి క్షతగాత్రులను కర్నూలుకు తరలించేలా చర్యలు తీసుకున్నానని చెప్పారు. అలాగే ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తుల మృతదేహాలను స్వస్థలాలకు తరలించామన్నారు. బాధితులకు అండగా ఉండి వారి చికిత్స కోసం తన సొంత నిధులు రూ. 3.50 లక్షలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయన వెంట వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు కే. రామ్మోహన్‌రెడ్డి, నందిరెడ్డిగారి రామిరెడ్డి, ఎంపీటీసీలు శంకర్‌నాయక్, చాంద్‌బాషా, రాజేష్, మాజీ సర్పంచ్ ముంతల విజయభాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌వంగాల నాగేశ్వరరెడ్డి, తదితరులు ఉన్నారు.

సత్తా చాటిన 'శ్రీ చైతన్య'

కర్నూలు(టౌన్): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని కళాశాల ఏజీఎం మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 466 మార్కులు ముగ్గురు విద్యార్థులు, 465 మార్కులు ఏడుగురు, 464 మార్కులు 12 మంది, 463 మార్కులు 15 మంది, 462 మార్కులు 24 మంది.. 461 మార్కులు 46 మంది.. 460 మార్కులు 65 మంది సాధించారన్నారు. అలాగే జూనియర్ బైపీసీ విభాగంలో 435 మార్కులు ముగ్గురు, 434 మార్కులు ఐదుగురు, 433 మార్కులు 10 మంది.. 430 మార్కులకు పైన 28 మంది విద్యార్థినీ విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ఆయన పేర్కొన్నారు.

'నారాయణ' ప్రతిభ

కర్నూలు(సిటీ): నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థులు సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినట్లు ఆ కాలేజీ కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూనియర్ విభాగం ఎంపీసీలో 466 మార్కులు ముగ్గురు, 465 మార్కులు 15 మంది, 464 మార్కులు 38 మంది, 460 మార్కులు 130 మంది, 450 మార్కులకుపైగా 443 మంది, 440 మార్కులకు పైగా 669 మంది, 400 మార్కులకుపైగా 1,415 మంది సాధించారన్నారు. జూనియర్ బైపీసీ విభాగంలో 435 మార్కులు ముగ్గురు, 433 మార్కులకుపైగా 12 మంది, 430 మార్కులకుపైగా 25 మంది, 420 మార్కులకు పైగా 87 మంది, 400 మార్కులకుపైగా 225 మంది విద్యార్థులు సాధించారన్నారు. అభినందన కార్యక్రమంలో కాలేజీ డీన్‌లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విద్యా కానుక పంపిణీ


విద్యార్థినులకు కిట్లు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంతి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకానుక కిట్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌ను మంగళవారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని పరిశీలించారు. కిట్ల పంపిణీలో తప్పులు తడకలు లేకుండా రికార్డులు సక్రమంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాగిజావ పంపిణీ చేయాలన్నారు. అనంతరం పాఠశాల లోని బియ్యం స్టాక్ పాయింట్‌ను పరిశీలించా రు. వెయింగ్ మిషన్‌పై బియ్యం బస్తాను పెట్టి తూకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని అన్నారు. అనంతరం విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. వీరి వెంట డీఈఓ అనురాధ, తహసీల్దార్ శ్రీనివాసు లు,హెచ్ ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

85,111 జేవీకే కిట్ల పంపిణీ

జిల్లాలో మంగళవారం 85,111 జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశామని డీఈఓ అనురాధ తెలిపారు. 47.55 శాతం ఇప్పటి వరకు పంపిణీ పూర్తయ్యిందన్నారు. ఐదు రోజుల పాటు పంపిణీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 1405 పాఠశాలలకు 1,62,276 జేవీకే కిట్లు మంజూరయ్యాయన్నారు.

నీట్‌లో మెరిసిన విద్యార్థులు


కె. సాయి ముఖేష్


కలోరినా ఈవాలిన్

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయిలో వైద్య విద్యా ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం రాత్రి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ ఫలితాలు విడుదల చేసింది. గత నెల 7వ తేదీ నిర్వహించిన నీట్ పరీక్షకు జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు జిల్లా నుంచి 5,282 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 5,200 మంది హాజరయ్యారు. నీట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన కురువ సాయి ముఖేష్ ఆల్ ఇండియా లెవల్‌లో 720 మార్కులకు గాను 670 మార్కులు సాధించారు. జాతీయ స్థాయిలో 2,990 ర్యాంకు, కేటగిరి విభాగంలో 925వ ర్యాంకు సాధించాడు. ఐ. కలోరినా ఈవాలిన్ ఆల్ ఇండియాలో 3,524వ ర్యాంకు, కేటగిరి విభాగంలో 1,125వ ర్యాంకు, దుర్గం సాహితీ ఆల్ ఇండియా లెవల్‌లో 5,500, కేటగిరి విభాగంలో 527 ర్యాంకు సాధించారు.

క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ


అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ధరలు తగ్గించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తన, ఎరువుల ధరలు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతులను ఉద్దేశించి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతన్నల పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదన్నారు. రైతుల గురించి మాట్లాడటం తప్ప ధరలు తగ్గించడంతో విఫలమైందన్నారు. ఒక వైపు ఎరువుల ధరలు, మరో వైపు పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ.. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధంకావాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కార్యదర్శి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన బుధవారం మండలసర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు పూర్తిసమాచారంతో ఉదయం 10.30 గంటలకు సమావేశానికిహాజరుకావాలన్నారు.

1476 మందికి ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు


వైద్య సేవలను పరిశీలిస్తుపన్న నోడల్ ఆఫీసర్

శిరివెళ్ల: జిల్లాలో 1,476 మందికి ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందించామని నోడల్‌అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక 2వ గ్రామ సచివాలయంలో 104 వైద్య సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షవాతం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్లు చేయించుకున్న వారి ఇళ్ల వద్దకు డాక్టర్లు వెళ్లి సేవలందిస్తున్నారన్నారు. మెరుగైన వైద్యసేవల కోసం ప్రతి వైద్యశాలలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారన్నారు.104ద్వారా 33మంది డాక్టర్లు సేవలందిస్తున్నారన్నారు. కార్య క్ర మంలో డీపీఎం రేఖ, బీపీ, షుగర్, దీర్ఘ కాలిక వ్యాధుల విభాగం డాక్టర్ కాంతారావు, స్థానిక డాక్టర్ విజయకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి


వీపీఏలకు సూచనలిస్తున్న ఏఓ

రుద్రవరం: ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ వీపీఏలకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆయన వీపీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరైన జీలుగలను రాయితీపై రైతులకు అందించాలని, ఒక్కో ఆర్బీకే పరిధిలో 80 మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ రాజు ఉన్నారు.


ఇతడి పేరు సత్యనారాయణ. మహానంది మండలం గాజులపల్లె గ్రామవాసి. కూలీ చేసుకుంటూ జీవనం సాగించే ఇతడు కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. చికిత్స కోసం నంద్యాల సర్వజన ఆసుపత్రికి రాగా పరీక్షించి పేగు జారిందని గుర్తించిన డాక్టర్లు వెంటనే ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయడంతో ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు. కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి రూ.వేలకు వేలు ఖర్చు పెట్టలేని తమకు ఉచితంగా వైద్యం అందించారని బాధితుడు సంతోషం వ్యక్తం చేశాడు.


రుద్రవరం మండలం కోటకొండ గ్రామానికి చెందిన రజియాబీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లినప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంది. షుగర్ ఎక్కువగా ఉందని డాక్టర్లు ఆమెను 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. మూడు రోజుల పాటు మెరుగైన వైద్యం చేయడం వల్ల ఇపుడు షుగర్ అదుపులోకి వచ్చింది. ప్రభుత్వ వైద్యులు తమ ఊరికి వచ్చి ఉచితంగా పరీక్షలు చేసి, వారే తనను ఇక్కడికి వాహనంలో తీసుకొచ్చి వైద్యం చేస్తుండటం నమ్మలేకపోతున్నానని ఆ వృద్ధురాలు చెమర్చిన కళ్లతో చెప్పింది.

పేదల వైద్యానికి పెద్ద దిక్కు

- సర్వజన ఆస్పత్రిలో నాణ్యమైన వైద్య సేవలు
- అధికారుల పర్యవేక్షణలో అత్యాధునిక వైద్యం
- కార్పొరేట్ వైద్యం పేదల చెంతకు
- నిరంతర సేవలతో పేదల ప్రాణాలకు భరోసా


నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

నంద్యాల టౌన్: పేదల వైద్యానికి స్థానిక సర్వజన ఆసుపత్రి పెద్ద దిక్కుగా సేవలందిస్తోంది. ఓపీలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారిని ఇన్‌పేషెంట్ విభాగంలో (ఐపీ) అడ్మిట్ చేసుకుని వైద్యులు వైద్య సేవలను అందిస్తున్నారు. సాధారణ వైద్య సేవలతో పాటు, అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించడంలోనూ నంద్యాల జిల్లా ఆసుపత్రి ముందు వరుసలో నిలుస్తోంది. నంద్యాల సర్వజన ఆసుపత్రికి కర్నూలు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి వైద్యం కోసం వస్తున్నారు. ప్రతి రోజు 1,200 నుంచి 1,400 మంది రోగులు ఓపీ చికిత్స పొందుతున్నారు. 350 నుంచి 450 మంది దాకా ఆసుపత్రిలోనే వైద్యుల ద్వారా చికిత్స చేయించుకుంటున్నారు. అత్యాధునిక పరికరాలు, వైద్య సౌకర్యాలు, ఆక్సిజన్, వెంటిలేటర్లతో రోగులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడుతున్నారు.

ఉచితంగా కార్పొరేట్ వైద్యం

కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, గ్యాస్ట్రో, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనకాలజీ, ఈఎన్‌టి, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పెథాలజీ, రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఆర్థోపెడిక్, డెంటల్, మానసిక వ్యాధుల వైద్య విభాగాలలో కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మెరుగ్గా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అరుదైన వ్యాధులను గుర్తించడంతో పాటు వాటికి చికిత్సలు చేస్తున్నారు. రేడియాలజీ విభాగంలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఎక్సరే మొమోగ్రామ్ వైద్య పరీక్షలను, పెథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లలో పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వైద్య సేవలతో పాటు నాణ్యమైన ఆహారాన్ని డైట్ ద్వారా రోగులకు అందిస్తున్నారు.

ఆస్పత్రి వివరాలు..	
వైద్యులు	-30
వైద్య సిబ్బంది	-74

ఆక్సిజన్ ప్లాంట్స్ (1000ఎల్‌పీయంం-2,10కేఎల్-1,1కేఎల్-6, 500ఎల్‌సీఎం-1, 330ఎల్‌సీఎం-1)	- 11
ఆక్సిజన్ సిలిండర్స్	- 100
ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్	- 50
ఆసుపత్రిలోని పడకలు	- 350
ఐసీయూ పడకలు	- 100
ఏడాదిలో జరిగిన ఆపరేషన్లు	- 400
ఏడాదిలో జరిగిన ప్రసవాలు	- 450

ఓపీ సమయం - ఉదయం 9 గంటల నుండి 1 గంట వరకు

ఏడాదిలో డయాలసిస్ చేయించుకున్న వారు	- 890
ఎంఆర్ఐ స్కానింగ్ చేయించుకున్న వారు	- 8,424
సీటీ స్కాన్ చేయించుకున్న వారు	- 13,740
108వాహనాలు	- 38
104వాహనాలు	- 33
నియోనాటల్ వాహనాలు	- 4
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	- 4

వైద్య సేవలు బాగున్నాయి


కళ్లు తిరగడంతోపాటు నీరసంగా ఉందని ఆసుపత్రికి వచ్చాను. రక్తం తక్కువగా ఉందని డాక్టర్లు చెప్పటంతో ఆసుపత్రిలో చేరాను. మంచి మందులు ఇచ్చారు. రక్తం అవసరమైతే ఉచితంగా ఎక్కిస్తామని వైద్యులు చెప్పారు. సమయానికి ఆహారం అందిస్తున్నారు. రెండు రోజులుగా ఇక్కడ ఉంటున్నాను. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స చేస్తూ పర్యవేక్షిస్తున్నారు.
– రామసుబ్బమ్మ, యాళ్లూరు, గోస్పాడు మండలం

వైద్యుల తీరు బాగుంది


ఆయాసం కారణంగా నంద్యాల ఆసుపత్రిలో ఐదు రోజుల క్రితం చేరాను. ఉచితంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. రోజుకు మూడు, నాలుగు సార్లు నా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ వసతులు బాగున్నాయి. ఇచ్చిన మందులు బాగా పనిచేస్తున్నాయి. వైద్యుల పనితీరు బాగుంది.
– రంగయ్య, గడిగరేవుల, గడివేముల మండలం

ఆరోగ్యశ్రీ ద్వారా అత్యాధునిక చికిత్సలు


డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా 3,254 రోగాలకు ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. చికిత్స అనంతరం రోగి పౌష్టికాహారం కోసం అదనంగా మరికొంత నగదు రోగి ఖాతాకు జమచేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 369 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. 14 రకాల టెస్టులు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో రోగి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆధునిక పద్ధతుల్లో వైద్య సేవలు చేస్తున్నాం.
– డీఎంఅండ్ హెచ్ఓ వెంకటరమణ

రాష్ట్రానికి బీజేపీ చేసిన ద్రోహం క్షమించరానిది

నంద్యాల(అర్బన్): ప్రత్యేక హోదా, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు చేస్తామంటూ బుకాయించిన బీజేపీ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య విమర్శించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రత్యక్షంగా బీజేపీతో అంటకాగుతున్నాయన్నారు. ఆ పార్టీలు మద్దతు ఇస్తాయనే భరోసాతోనే బీజేపీ ఏపీలో పాదం మోపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి చేసిన ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, శివారెడ్డి, ఆనందరావు, రఫీ, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక ఇద్దరు మృతి

శిరివెళ్ల: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కోలుకోలేక మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జీనే పల్లెకు చెందిన ఓబులమ్మ (65) ఈనెల 11 ఎలుకల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. వీరారెడ్డిపల్లెకు చెందిన అక్బర్ (38) మద్యం కోసం భార్య డబ్బులివ్వలేదని ఈనెల 8న ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కర్నూలుఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు.

- దొర్నిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న దూదేకుల హుసేన్ బాషా (35) కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. చాగలమర్రికి చెందిన దూదేకుల హుసేన్‌బాషా, అబ్దుల్‌వలి కోవెలకుంట్ల మండలం రేవనూరుకు బయలుదేరారు. దొర్నిపా డు శివారులోకి చేరుకోగానే ద్విచక్రవాహం బర్రెను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. బంధువుల కడప రిమ్స్ వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందారు. అబ్దుల్‌వలి చికిత్స పొందున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు రక్త దాతల దినోత్సవం

నంద్యాల టౌన్: ప్రపంచ రక్త దాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్లడ్‌బ్యాంక్‌ల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ, నియంత్రణ అధికారి డాక్టర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రక్త దాతలకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలన అందజేసి, సన్మానించనున్నామన్నారు.

జగనన్నతోనే సంక్షేమం


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



పనులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చాపిరేవుల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పథకాల పరంగా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, సర్పంచ్ దేవి, ఎంపీటీసీ రత్నమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, శేఖర్‌రెడ్డి, బాలారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఎర్రబోలు శివారెడ్డి, రామసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

- చాపిరేవుల గ్రామంలో ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి రైతులకు 390 క్వింటాళ్ల జీలుగలు, 10 క్వింటాళ్ల జనుము విత్తనాలను పంపిణీ చేశారు.
- జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి పంపిణీ చేశారు.

మెడికల్ కళాశాల పనుల తనిఖీ

నంద్యాలటౌన్: స్థానిక మెడికల్ కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. తుది దశకు చేరుకున్న వివిధ విభాగాలకు చెందిన భవనాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైద్య కళాశాల మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోందన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిసనర్ రవిచంద్రారెడ్డి ఉన్నారు.

నాడు-నేడు పనులను పూర్తి చేయండి


పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న జేసీ

నంద్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పనులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గది తదితర పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయించాలని డీఈఓ అనురాధను ఆదేశించారు. విద్యార్థులతో కాసేపు కలెక్టర్ ముచ్చటిస్తూ బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం 2వ వార్డు మాలాద్రిపేట 54వ చౌక దుకాణాన్ని, బాలాజీ కాంప్లెక్స్‌లోని 108వ చౌక దుకాణాలను తనిఖీ చేశారు. జేసీ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(అర్బన్): స్థానిక సాయిబాబానగర్ పక్కీర్ పేట వద్ద ఉన్న 58వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీఓ చంద్రకళలతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కలెక్టర్ అంగన్‌వాడీ కార్యకర్త అనురాధకు సూచించారు. ఆయన వెంట ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీఓ చంద్రకళ ఉన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


విద్యాకానును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాకరాజువేముల ఎంపీపీ (స్పెషల్) స్కూల్‌లో హెచ్ఎం అమరేశ్వరప్ప అధ్యక్షతన జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అమ్మ ఒడి, విద్యాకానుక, వసతి, విద్యాదీవెనలు, మన బడి నాడు-నేడు వంటి పథకాలతో పాటు పాఠ్యప్రణాళిక, మౌలిక సదుపాయాల కల్పన పరంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. గతంలో తొలిరోజు బడికి పోవాలంటే పేదలు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం విద్యాకానుకలో బ్యాగు, పాఠ్య, నోటు పుస్తకాలు, షూ, సాక్సులు, బెల్టు, యూనిఫాం అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇప్పటికే ట్యాబ్‌లు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మిని, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు మోహన్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్, మహబూబ్‌బాషా, ఎంఈఓ అబ్దుల్ కరీం, తహసీల్దార్ జయప్రసాద్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రామక్రిష్ణ, తేజేంద్ర పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచండి


అవగాహన సదస్సు నిర్వహిస్తున్న డీఈ నాగరాజు

చాగలమర్రి: మండల కేంద్రంలోని ఐదు జగనన్న లేఅవుట్లలోని గృహ నిర్మాణాల పనుల్లో పురోగతి పెంచాలని ఆళ్లగడ్డ హౌసింగ్ డీఈ నాగరాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయాల సిబ్బంది, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, వలంటీర్లతో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మాన్యం భూముల కౌలుకు వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

రుదరవరం: స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ శాఖ అధికారులు మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించారు. 32.79 ఎకరాల మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహించగా రూ.3.40 లక్షల ఆదాయం సమాకూరినట్లు ఈఓ సాయిజయచంద్రారెడ్డి తెలిపారు.

ఈఓఆర్‌డీగా నాగఅనసూయ

గోస్పాడు: గోస్పాడు ఈఓఆర్‌డీగా నాగఅనసూయ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న నాగేంద్రుడని శిరివెళ్ల మండలానికి, దొర్నిపాడులో పనిచేస్తున్న నాగఅనసూయ గో స్పాడుకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమె విధుల్లో చేరారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. 3వ రోజు మంగళవారం 1వ సచివాలయ పరిధిలోని 2వ వార్డు చింతలచేరువు రస్తా, 3వ వార్డు వినాయక నగర్‌లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పింఛన్లు కావాలని కొందరు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మరికొందరు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దరఖాస్తులు పరిశీలించి అర్హత ఉంటే తప్పకుండా మంజూరు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఉపసర్పంచ్ మహమ్మద్ సోహెల్, ఎంపీటీసీ సభ్యులు పత్తి నారాయణ, చక్రం షబ్బీర్, బురాందీన్, గేట్ల మాబు, మండల నాయకులు మల్లారెడ్డి, ముల్లా ఖాదర్‌బాషా, రామిశెట్టి శ్రీను, ఎంపీడీఓ మహబుబ్ దౌలా పాల్గొన్నారు.

మారెమ్మ ప్రత్యేక పూజలు

మండలంలోని డి.వనిపెంట మజారా గ్రామంన ఒంటి గుడిసె తండాలో మంగళవారం జరిగిన మారెమ్మ తల్లి జాతరకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి హాజరయ్యారు. అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను నాయక్, రాముడు నాయక్, గోలునాయక్‌ల ఆతిథ్యం స్వీకరించారు.

అక్రమ కట్టడాలను తొలగిస్తాం


బస్టాండు ఆవరణలో దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న డీఈ

ఉయ్యాలవాడ: భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక బస్టాండు ఆవరణలో రోడ్డుపై బంకులను ఏర్పాటు చేసుకున్న దుకాణదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు ఆక్రమణలు చేసిన వారికి గ్రామ పంచాయతీ ద్వారా నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం కట్టడాలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. అలాగే ఈ రహదారిలో హరివరం, పడిగెపాడు, క్రిష్టిపాడు, కంపమల్ల, ఇంజేడు, పెద్దయమ్మనూరు గ్రామాల్లో కూడా వారం రోజుల్లో సర్వే చేసి తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు డీఈ తెలిపారు. ఈయన వెంట పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, సర్పంచ్ ఓబులేస్ ఉన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శివానంద పాఠశాలలో కౌన్సిలర్ సన్నల అనూష ఆధ్వర్యంలో జగనన్న కిట్లను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.